క్లుప్తంగా

జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎన్జీజీఓ నేతలు



కలెక్టర్ నివాస్‌ను కలిసిన సంఘ నాయకులు

కాకినాడ సిటీ: నూతన జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జె నివాస్‌ను ఏపీఎన్జీఓ సంఘ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గ ప్రతినిధులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘ జిల్లా నాయకులు గుద్దటి రామమోహన్‌రావు, పేపకాయల కృష్ణ, పాలపర్తి మూర్తిబాబు, కేవీఎస్‌వీ ప్రసాద్, పాము శ్రీనివాస్, ఎస్ వీరబాబు, వి శ్రీనివాసరావు, సత్తిరాజు, రామకృష్ణ తదితరులు ఉన్నారు. ఉద్యోగుల సమస్యలను ఈ సందర్భంగా నాయకులు కలెక్టర్ నివాస్‌కు వివరించారు. ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్టు నాయకులు తెలిపారు.

పూర్వ కలెక్టర్ కృతికా శుక్లాకు సత్కారం



కృతికా శుక్లాను సత్కరిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లా కలెక్టర్‌గా విశిష్ట సేవలందించిన కృతికా శుక్లాకు ఏపీఎన్జీఓ సంఘ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గ ప్రతినిధులు శనివారం వీడ్కోలు పలికారు. ఆమెను దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు గుద్దటి రామమోహనరావు, పేపకాయల వెంకటకృష్ణ, మట్టపర్తి వెంకటేశ్వరరావు, పాలపర్తి మూర్తిబాబు, సరెల్ల చంద్రరావు, బి సుజాత తదితరులు పాల్గొన్నారు.

సూర్యారావుపేటలో ఆరోగ్య సురక్ష శిబిరం



శిబిరంలో గ్రామస్తులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

కాకినాడ రూరల్: మండలంలోని సూర్యారావుపేట గ్రామంలో సచివాలయం-1 వద్ద కొమరగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది శనివారం గ్రామస్తులకు ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. డాక్టర్ సందీప్ ఆధ్వర్యంలో వైద్య శిబిరంలో 324 మందికి వైద్య సేవలందించారు. వీరిలో 113 మందికి జనరల్ వైద్య సేవలు, 58 మందికి షుగర్, 73 మందికి బీపీ, 22 మందికి కంటి పరీక్షలు, 11 మంది గర్భిణులకు, 45 మందికి ఇతర వైద్య సేవలు అందించారు. శిబిరంలో వైద్యులు సాజిద్, దీప్తి చాందిని, మహేశ్వరరావు పాల్గొన్నారు.

నోటి శుభ్రతతోనే చక్కటి జీర్ణ క్రియ



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సాయికార్తీక్

కాకినాడ రూరల్: నోటి శుభ్రతతో జీర్ణ వ్యవస్థ చక్కగా పనిచేస్తుందని ప్రముఖ దంత వైద్యుడు సాయి కార్తీక్ అన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటిలోని ఏ భాగం వ్యాధిగ్రస్తమైనా, దాని ప్రభావం జీర్ణ వ్యవస్థపై ఉంటుందన్నారు. చిగుళ్లపై పుండ్లు ఏర్పడినా, బ్యాక్టీరియాతో వ్యాధిగ్రస్తమైనా, చీము పట్టినా, దంతాల్లో రంధ్రాలు ఏర్పడినా, పుచ్చినా, నోటిలో లాలాజలం సరిగా ఊరకపోయినా జీర్ణశక్తి దెబ్బతింటుందని వివరించారు. సదస్సులో దంత వైద్యుడు అద్దాల సత్యనారాయణ, అడబాల రత్నప్రసాద్, రాఘవరావు, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బాలలకు సంస్కృతిని అలవర్చాలి

బోట్‌క్లబ్: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను బాల్యం నుంచే అలవర్చాలని భోగిగణపతి పీఠం వ్యవస్థాపక ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు అన్నారు. శనివారం ఉదయం పీఠంలో శ్రీవారి 23వ జపయజ్ఞ పారాయణ జరిగింది. రాజమహేంద్రవరానికి చెందిన గోదావరి సంస్కృతీ సంస్థ నిర్వహించిన కూచిపూడి నృత్య బృందగాన పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన కాకినాడ రూరల్ మండలం చీడిగ గ్రామానికి చెందిన దేవరపల్లి మాధుర్య సాయిని గణపతి పీఠంలో సత్కరించారు. సంప్రదాయ కూచిపూడి నృత్య అభ్యాసనలో మాధుర్యను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను సత్కరించారు.

అందరికీ ఆరోగ్య భాగ్యం

- పల్లెపల్లెకూ విస్తరించిన వైద్య, ఆరోగ్య సదుపాయాలు
- విరివిగా అర్బన్ హెల్త్ సెంటర్లు, విలేజ్ క్లినిక్‌లు
- కాకినాడ సిటీలో 13 పట్టణ ఆరోగ్య కేంద్రాలు
- కాకినాడ రూరల్‌లో 39 విలేజ్ క్లినిక్‌ల్లో సేవలు



కాకినాడ నగరంలో నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రం



నేమాం గ్రామంలో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్

కాకినాడ సిటీ: ప్రజారోగ్యమే పరమావధిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్లె, పట్టణ ప్రజల చెంతకు వైద్యాన్ని మరింత చేరువ చేశారు. ప్రతి 2,500 జనాభా ఉన్న ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాలను (విలేజ్ క్లినిక్), పట్టణ ఆరోగ్య కేంద్రాలను నెలకొల్పారు. కాకినాడ సిటీ నియోజకవర్గంలో 13 పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయగా, రూరల్ నియోజకవర్గంలో 39 ఆరోగ్య కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పట్టణాల్లో ఒక్కొక్క ఆరోగ్య కేంద్రాన్ని రూ.80 లక్షల వ్యయంతో నిర్మించగా, గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లను రూ.20.80 లక్షల వ్యయంతో నెలకొల్పారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.8.75 లక్షలు, వైద్యారోగ్య శాఖ నుంచి రూ.8.75 లక్షలు, అదనంగా వైద్యారోగ్య శాఖ నుంచి మరో రూ.3.30 లక్షలు కేటాయించి వీటి నిర్మాణాలు చేపట్టారు.

శరవేగంగా నిర్మాణాలు

గ్రామ సచివాలయాల సమీపంలోనే ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని దాదాపు 19 గ్రామాల్లో వీటి నిర్మాణాలు పూర్తి కాగా, మరి కొన్ని గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌లు శరవేగంతో పనులు కొనసాగుతున్నాయి. కాకినాడ నగరంలోని 13 చోట్ల పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రజలకు వైద్య సేవలందిస్తున్నాయి.

సులభంగా వైద్య సేవలు

వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాల్లో బీఎస్సీ నర్సింగ్ చదివిన మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ)ను నియమించారు. స్థానిక ఏఎన్ఎం, ఆశా వర్కర్ల సేవలనూ వినియోగించుకుంటున్నారు. కేంద్రాల్లో 12 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు, 65 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు హైరిస్క్, గర్భిణులను ముందుగా గుర్తించి సేవలందిస్తున్నారు. పిల్లలకు వాక్సిన్లతో పాటు, తాగునీటిని కూడా ఎంఎల్‌హెచ్‌పీలు పరీక్షిస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 24 గంటలూ వైద్య సిబ్బంది అందుబాటులో ఉండటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఈ కేంద్రాలు పల్లె, పట్టణ ప్రజల ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తున్నాయి. అత్యవసర వేళల్లోనూ కచ్చితమైన సేవలందిస్తున్నాయి.

స్థానికంగానే సేవలు



ముఖ్యమంత్రి జగనన్న మా ఊరిలో ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు. గతంలో మండల కేంద్రానికి వెళ్లే వాళ్లం. ఇప్పుడు ఏ సమస్య వచ్చినా స్థానికంగా వైద్య సేవలు పొందుతున్నాం. అలాగే ఇప్పుడు ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా రూ.25 లక్షల విలువైన వైద్యం పొందడానికి అవకాశం కల్పించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– కర్రి శ్రీను, గ్రామస్తుడు, ఉప్పలంక

పెద్ద ఎత్తున అభివృద్ధి



గ్రామాల్లో అవసరమైన అన్ని రకాల ప్రభుత్వ భవనాల నిర్మాణాలు చేపట్టడంతో ఎంతో సంతోషంగా ఉంది. గతంలో ఎన్నడూ ఇంత పెద్దఎత్తున అభివృద్ధి పనులు జరగలేదు. నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలను పాటించి, భవన నిర్మాణాలు చేపట్టారు. గ్రామంలో ఒకే ప్రాంతంలో సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలు నిర్మించడం ప్రజలకెంతో ఉపయోగకరంగా ఉన్నాయి.

– బొమ్మిడి సతీష్, యువ నాయకుడు

నీటి సమస్య ఉందా?

టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని కమిషనర్ వెంకటరావు సూచన



కమిషనర్ జె.వెంకటరావు

కాకినాడ: ప్రస్తుత వేసవిలో ఎక్కడైనా మంచినీటి సమస్య ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ప్రజలను కోరారు. వేసవి నీటి ఎద్దడిపై కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ జె.నివాస్ ఆదేశాల మేరకు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవి నీటి ఎద్దడిపై జిల్లా కలెక్టర్‌తో శనివారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఈ మేరకు వాటర్ వర్క్ అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఏ ప్రాంతంలోనైనా నీటి సమస్య ఎదురైతే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1800 4255 990కు కాల్ చేయాలని కమిషనర్ సూచించారు. సత్వరమే నీటి సమస్యను పరిష్కరించడంతో పాటు, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామని చెప్పారు. ప్రజలెవ్వరూ మంచినీటి కోసం ఇబ్బంది పడకుండా ఇప్పటికే అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. రూ.1.28 కోట్ల ఖర్చుతో వేసవి కార్యాచరణను కూడా సిద్ధం చేశామని కమిషనర్ తెలిపారు.

ద్వారంపూడికి అడుగడుగునా బ్రహ్మరథం

- ఇంటింటా ఎమ్మెల్యే ద్వారంపూడి ఎన్నికల ప్రచారం
- హారతులిచ్చి.. స్వాగతించిన మహిళలు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: కాకినాడ సిటీ వైఎస్సార్ సీపీ సిటీ అభ్యర్థి, స్థానిక ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి ఎన్నికల ప్రచారంలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా మహిళలు హారతులిచ్చి ఆయనకు అపూర్వ స్వాగతం పలికారు. ప్రచారంలో భాగంగా శనివారం 13వ డివిజన్ పిడుగులమ్మ గుడి నుంచి ఎమ్మెల్యే ద్వారంపూడి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. సంజయ్‌నగర్‌లోని ఇంటింటికీ వెళ్లి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ, రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌తో పాటు, తనకూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో భాగంగా పలు ప్రాంతాల్లో ప్రజలు ఎమ్మెల్యేకు హారతులు పట్టి, పూల వర్షంతో స్వాగతించారు. సంజయ్‌నగర్, సాంబమూర్తినగర్ ప్రాంతాల్లో జరిగిన ఈ ప్రచారంలో ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో విజయం సాధించగలనన్న ధీమాను వ్యక్తం చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాకినాడ నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని, అందువల్ల విజయం తనదేనన్న ధీమాను వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే సతీమణి ప్రచారం



తన భర్త ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని గెలిపించాలని అభ్యర్థిస్తున్న మహాలక్ష్మి

ఎమ్మెల్యే ద్వారంపూడి సతీమణి ద్వారంపూడి మహాలక్ష్మి శనివారం 38వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. గాంధీనగర్, ఎలిఫెన్‌పేట ప్రాంతాల్లో పర్యటించిన ఆమె ప్రతి ఇంటికీ వెళ్లి తన భర్త, ఎమ్మెల్యే ద్వారంపూడి చేసిన అభివృద్ధిని వివరించి, మరోసారి ఆయనను గెలిపించాలని అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు. ఆమె వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు ఉన్నారు.

పటిష్టంగా ఎన్నికల కోడ్ అమలు

- ప్రజలకు వడదెబ్బపై అవగాహన
- సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు నింపండి
- మండల, మున్సిపల్ అధికారులకు కలెక్టర్ జె.నివాస్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: సాధారణ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో క్షేత్రస్థాయి ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ అధికారులను ఆదేశించారు. వేసవి వడగాడ్పులు, తాగునీరు, ఎన్నికల కోడ్ అమలు, నిత్యావసర సరకుల పంపిణీ వంటి అంశాలపై రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, వైద్యారోగ్య, డ్వామా, డీఆర్‌డీఏ తదితర శాఖల అధికారులతో శనివారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి జేసీ రామ్‌సుందర్‌రెడ్డితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సార్వత్రిక ఎన్నికల కోసం నియమించిన వివిధ బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించి, కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. మండల, మున్సిపాలిటీల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి సక్రమ అమలుకు ఆర్వోలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వేసవి దృష్ట్యా ఎక్కడా తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. తాగునీటికి ఎక్కడైనా సమస్యలు తలెత్తితే, వెంటనే జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ప్రణాళిక ప్రకారం నూరు శాతం నీటితో నింపాలన్నారు. ఉపాధి హామీ కూలీలు ఎండ దెబ్బ తగలకుండా పని వేళలు, పని చేసే ప్రాంతాల్లో డేరాలు, తాగునీరు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యారోగ్య శాఖ ఏఎన్ఎం, ఆశా వర్కర్ల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. అధికారుల సహకారం, భాగస్వామ్యంతో జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు కృషి చేయాలని కలెక్టర్ నివాస్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో తిప్పేనాయక్, జెడ్పీ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి, డీపీవో కె.భారతి సౌజన్య, జిల్లా వైద్యాధికారి జె.నరసింహనాయక్, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎం శ్రీనివాస్, ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పూర్తి చేయండి

కాకినాడ జిల్లాలోని పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాల్, రిసెప్షన్ సెంటర్లలో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ ఆదేశించారు. శనివారం రాత్రి జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాలు, రిసెప్షన్ సెంటర్లను, వాహనాల పార్కింగ్‌లను జేఎన్‌టీయూ, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, ఎన్నికల, సర్వే అధికారులతో కలిసి కలెక్టర్ నివాస్, జేసీ రామసుందర్‌రెడ్డి పరిశీలించారు. జేఎన్‌టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ, మెకానికల్ ఇంజినీరింగ్ బ్లాక్‌లను సందర్శించారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాలు, రిసెప్షన్ సెంటర్లను జేఎన్‌టీయూలో ఏర్పాటు చేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. అన్ని సౌకర్యాల పనులు నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ మోహన్‌ప్రసాద్, ఆర్అండ్‌బి ఈఈ టి రమేష్‌కుమార్, కలెక్టరేట్ ఎన్నికల డీటీ ఎం జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నియంత్రణకు బాధ్యతగా వ్యవహరించాలి

- హెచ్ఐవీ–ఎయిడ్స్ పుస్తక ఆవిష్కరణ



హెచ్ఐవీ–ఎయిడ్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ప్రసన్నకుమార్, చిత్రంలో డాక్టర్ మురళీకృష్ణ

కాకినాడ క్రైం: కాకినాడకు చెందిన ప్రముఖ సంక్రమిక వ్యాధుల నిపుణుడు డాక్టర్ యనమదల మురళీకృష్ణ రచించిన హెచ్ఐవీ–ఎయిడ్స్ పుస్తక ఆవిష్కరణ శనివారం ఘనంగా జరిగింది. కచేరిపేటలో ఉన్న లక్ష్మీ వైద్యశాలలో రంగరాయ వైద్య కళాశాల విభాగాధిపతి డాక్టర్ పీవీ ప్రసన్నకుమార్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ నియంత్రణకు డాక్టర్ మురళీకృష్ణ ఓ యజ్ఞం తరహా సంకల్పాన్ని అందిపుచ్చుకున్నారని కొనియాడారు. పాతికేళ్ల క్రితం ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను చికిత్స అందించేందుకు ఎందరో వైద్యులు వెనకడుగేస్తున్న తరుణంలో, ఎందరో బాధితుల ప్రాణాలకు అండగా నిలిచారన్నారు. ఆయన వద్ద వైద్యం పొందిన ఎందరో రోగులు పాతికేళ్లుగా నాణ్యమైన జీవితాన్ని గడుపుతూ, జీవన ప్రమాణాలను పెంచుకున్నారన్నారు. కోవిడ్ అనుబంధ ఎయిడ్స్ బాధితుల స్థితిగతులు, ఆరోగ్య పరిస్థితులపై ఆయన రచించిన పుస్తకానికి జాతీయ స్థాయి గుర్తింపు రావడం జిల్లావాసులకు గర్వకారణమన్నారు. 23 ఏళ్ల క్రితం హెచ్ఐవీ ఫిజీషియన్‌గా ఆయన ప్రతిపాదించిన రెండు ఔషధాల విధానం ప్రస్తుతం అమెరికా, యూరప్ దేశాల వైద్య సేవల్లో తలమానికంగా నిలిచిందని పేర్కొన్నారు. డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ అరక్షిత లైంగిక చర్యల ప్రధాన కారణంగా సంక్రమించే హెచ్ఐవీ వ్యాప్తిని పూర్తి స్థాయిలో నియంత్రించడం కష్టసాధ్యమన్నారు. తెలుగు రాష్ట్రాల్లో హెచ్ఐవీ వ్యాప్తి దేశ సగటు కంటే ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. ఆ పరిస్థితి మారేందుకు ఆరోగ్య విభాగాల్లో సేవలందిస్తున్న వారితో పాటు, సామాన్య ప్రజలు బాధ్యతగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తాను 2000వ సంవత్సరంలో రచించిన ఎయిడ్స్ పుస్తకం ఆరు ముద్రణలతో ఎనిమిది వేల కాపీలు పాఠకులకు చేరాయన్నారు. హెచ్ఐవీ–ఎయిడ్స్ అవగాహన తరగతులు నిర్వహిస్తున్న వారికి తన పుస్తకం ఓ కరదీపికగా ఉంటుందని వెల్లడించారు. హెచ్ఐవీ, క్షయ వ్యాధులపై చెప్పుకోదగ్గ పరిశోధనలు చేసి, విశేష జ్ఞానం, అనుభవాన్ని క్రోడీకరించి తాజా హెచ్ఐవీ–ఎయిడ్స్ పుస్తకాన్ని రచించినట్టు తెలిపారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ద్వారంపూడి



ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ సిటీ: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా కాకినాడ సాంబమూర్తినగర్ 13వ డివిజన్ రెవెన్యూ కాలనీ హబీబియా మసీదులో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డికి ముస్లిం సోదరులు ఘన స్వాగతం పలికారు. ముస్లింలకు ద్వారంపూడి రంజాన్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దువా (ప్రార్థన) నిర్వహించి, ఇఫ్తార్ విందు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ముస్లిం పెద్దలు, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి సత్కారం



సిబ్బందిని సత్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

కాకినాడ సిటీ: కాకినాడ ఆర్టీసీ డిపోలో ఈ నెల 31న పదవీ విరమణ చేస్తున్న ఇద్దరు సిబ్బందిని శనివారం ఆర్టీసీ అధికారులు సత్కరించారు. సత్కారం పొందిన వారిలో ఒకరు డ్రైవర్ కాగా, మరొకరు కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. పదవీ విరమణ చేస్తున్న జేకే కుమారి, ఎస్ అర్జునరావును డిపో అధికారులు టి బాలకృష్ణ, కె ప్రభాకరరావు, డి.త్రిమూర్తులు సమక్షంలో డిపోలో సిబ్బంది సత్కరించారు.

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్



రన్ ఫర్ జీసస్‌లో పాల్గొన్న క్రైస్తవ సంఘ నాయకులు, పాస్టర్లు, యూత్ సభ్యులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఈస్టర్ పండగను పురస్కరించుకుని ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ కాకినాడ జిల్లా శాఖ శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ఏఐసీసీ జిల్లా అధ్యక్షుడు రిక్కిగూటం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక భానుగుడి సెంటర్ నుంచి ఈ రన్‌ను సీనియర్ పాస్టర్లు జోసెఫ్ బెన్ని, జ్యోతి కుమార్, స్టీఫెన్ ఆనంద్, రిక్కి గూటం జెండా ఊపి ప్రారంభించారు. భానుగుడి నుంచి ప్రారంభమైన ర్యాలీ టూ టౌన్, విజయలక్ష్మి హాస్పటల్ మీదుగా టౌన్ హాల్, ఎస్ఆర్ఎంటీ ఫంక్షన్ హాలు, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్, కల్పనా సెంటర్ నుంచి ఆనందభారతి గ్రౌండ్స్‌కు చేరింది. ఈ సందర్భంగా జోసెఫ్ బెన్ని మాట్లాడుతూ నగరంలో 15 ఏళ్లుగా ఈస్టర్ పండగ సందర్భంగా రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని క్రైస్తవ సంఘాల నాయకులు, సంఘ సభ్యులు, యూత్ సహకారంతో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రన్ ఫర్ జీసస్ మతసామరస్యానికి అద్దం పడుతోందన్నారు. జిల్లా అధ్యక్షుడు రిక్కిగూటం మాట్లాడుతూ పునరుత్థానుడైన ఏసు క్రీస్తును స్తుతిస్తూ కుల, మతాలకతీతంగా వేలాది మంది ఈ రన్‌లో పాల్గొనడం హర్షణీయమన్నారు. ఈ రన్‌లో విలియమ్స్, రెడ్డి అంకిత స్టీఫెన్, జోసెఫ్, దడాల జాషువా, మూర్తిరాజు, కేటీసీ సుమలత, క్రైస్తవ సంఘాల పాస్టర్లు, నాయకులు, క్రైస్తవ సంస్థల ప్రతినిధులు, యూత్ పాల్గొన్నారు.

టీడీపీకి రాజారపు గుడ్ బై

కాకినాడ సిటీ: టీడీపీ సీనియర్ నాయకుడు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజారపు మహేష్ శనివారం ఆ పార్టీకి రాజీనామా చేసి, కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పల్లంరాజుతో వెళ్లి పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం ఉదయం కాకినాడ నరసన్న నగర్ నుంచి వంద మంది అభిమానులతో విజయవాడ వెళ్లి, కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు మహేష్ విలేకర్లకు తెలిపారు.

గేట్–2024 ర్యాంకర్లకు అభినందనలు



గేట్‌లో విశేష ర్యాంకులు పొందిన వారితో వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): గ్రాడ్యుయేట్ అప్టిట్యూట్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్)–2024 పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను శనివారం సాయంత్రం వీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో అభినందన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రతిభ చూపడం సంతోషమని, విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాలను సాధించేందుకు పట్టుదలతో శ్రమించాలన్నారు. ర్యాంకర్లు వై.లక్ష్మీసాయికృష్ణ(10వ ర్యాంక్, ఈసీఈ)తో పాటు, సివిల్ నుంచి 30, ఈఈఈ విభాగం 65, సీఎస్ఈ 25, కెమికల్ 8, పెట్రోలియం ఇంజినీరింగ్ ఆరుగురు ర్యాంకులు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను రిజిస్ట్రార్ సుమలత, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రత్నకుమారి, మీరాసాహెబ్ అభినందించారు.

ఈస్టర్ వేడుకలకు సర్వం సిద్ధం



రంగులు దిద్దిన సాంబమూర్తినగర్‌లోని క్రైస్తవ శ్మశాన వాటిక

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఈస్టర్ క్రైస్తవులకు ముఖ్య పండగ. ఏసుక్రీస్తు పునరుత్థానాన్ని క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుతారు. ఈ నెల 31న ఆదివారం ఈస్టర్ పండగను జరుపుకోవడానికి కాకినాడ నగరంలోని చర్చిలు సిద్ధమయ్యాయి. ఇప్పటికే క్రైస్తవ శ్మశాన వాటికలను రంగులతో, విద్యుత్ కాంతులతో అలంకరించారు. ఈస్టర్ పండగ రోజు తెల్లవారుజామున 3 గంటల నుంచి సమాధుల వద్దకు క్రైస్తవులు పెద్ద సంఖ్యలో చేరుకుని, తమ కుటుంబ సభ్యులు, స్నేహితుల సమాధులపై కొవ్వొత్తులు వెలిగించి, పూలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అనంతరం ఇంటికి చేరుకుని, కొత్త దుస్తులు ధరించి ఈస్టర్ ప్రత్యేక ఆరాధనకు హాజరవుతారు. నగరంలో సాంబమూర్తి నగర్, డెయిరీఫాం సెంటర్, రమణయ్యపేట, గైగోలుపాడు ప్రాంతాల్లో క్రైస్తవ సమాధులను శనివారమే ముస్తాబు చేశారు. నగరంలో అర్బన్ ఎమ్మార్వో భవన్ సమీపంలోని క్రెగ్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి, రామారావుపేటలోని సెయింట్ లూథరన్ చర్చి, గాంధీనగర్‌లోని హౌస్ ఆఫ్ ప్రేయర్, ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి, జగన్నాథపురంలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, రోమన్ కేథలిక్ చర్చి, చీడీలపొరలోని షాలోమ్ ప్రేయర్ హౌస్, రిజర్వ్‌లైన్ పోలీస్ క్వాటర్స్ బాప్టిస్ట్ చర్చి, ఏపీఎస్పీ యూనియన్ బాప్టిస్ట్ చర్చి, పీస్‌మేకర్స్ మినిస్ట్రీస్ చర్చి ఆధ్వర్యంలో, క్రెగ్ ఇమ్మానుయేల్ చర్చిల్లో ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. కొన్ని చర్చిల్లో పేదలకు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారు.